## నల్లధనం వెలికితీత

## కోటలు దాటే మాటలు-గడపలు దాటని చేతలు

**దేశంలో** దాగిన నల్లధనం గురించి, దానిని వెలికితీయటం గురించి దశాబ్దాలుగా చర్చ సాగుతూనే వుంది. ముఖ్యంగా గత దశాబ్దకాలంలో యుపిఏ, ఎన్‌డిఏ కూటములు సార్వత్రిక ఎన్నికల ప్రచార సందర్భంగా నల్లధనం అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ వస్తున్నాయి. రెండున్నర దశాబ్దాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో, అవినీతి మోతాదు, కుంభకోణాల సంఖ్య పెరిగిపోతూ లక్షలకోట్ల రూపాయల ప్రజాధనం లెక్కకు రాకుండాపోతున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమౌతోంది. ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తే దేశ, విదేశాల్లోని నల్లధనాన్ని వెలికి తీసుకువస్తామని ఎవరికి వారు గప్పాలు గొడ్తూ వస్తున్నారు. 2014 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే విదేశాల్లో పోగుబడిన నల్లధనాన్ని వెలికితీసి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో 15 లక్షల రూ॥జమ చేస్తామని నరేంద్రమోదీ వాగ్దానం చేశాడు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ అధికారం చేబట్టి రెండున్నర ఏళ్ళు గడిచిపోతున్నా, కమిటీలు, వాదనలు, న్యాయస్థానాలు, విచారణలు మినహా నల్లధనం వెలికితీత అంశం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' చందంగా మిగిలింది.

విదేశాలకు తరలిపోయి, స్విస్‌బ్యాంకుతో సహా వివిధ విదేశీ బ్యాంకుల్లో మూల్గుతున్న నల్లధనం విలువ 70 లక్షలకోట్ల రూ॥పై మాటేనని వివిధ అంచనాలు తెలుపుతున్నాయి. విదేశాలలో నల్లధనం పోగుపడటం ప్రధానంగా రెండు విధాలుగా సాగుతోంది. ఒకటి- మనదేశంలో తయారైన ఉత్పత్తులను, సరుకులను లేదా సేవలను ఇతర దేశాలకు ఎగుమతిచేసి, వాస్తవంగా అమ్మిన ధరకంటే లెక్కలలో తక్కువ ధరను చూపటం; రెండవది-ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకున్న సరుకులకు, ఉత్పత్తులకు వాస్తవంగా చెల్లించిన ధరకంటే లెక్కలలో ఎక్కువ ధరను చూపటం. పై రెండు మార్గాలలో ఎగుమతి, దిగుమతులలో అక్రమాలద్వారా మిగుల్చుకుంటున్న ఈ 'నల్ల' ధనాన్నంతా విదేశీ బ్యాంకుల్లో నిల్వ చేస్తున్నారు. ఈ రూపంలో విదేశాలకు సంపద తరలింపు-మొత్తంగా విదేశాలకు నల్లధనం తరలింపు మార్గాలలో 77.8 శాతంగా వుందని గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటెగ్రిటీ సంస్థ గత సంవత్సరం తన అధ్యయనంలో తెలిపింది. ఇలా నల్లధనం తరలింపు ప్రతి ఏడాదీ 9.4 శాతం చొప్పున పెరుగుతూ వుందని ఆ అధ్యయనం తెలియజేసింది.

ఇక, దేశంలో పన్నుల ఎగవేతద్వారా, ఆదాయాన్ని తగ్గించిచూపటం ద్వారా, అక్రమార్జనలద్వారా ప్రభుత్వ ఖాతాలలో వెల్లడికాకుండా బడాపెట్టుబడిదార్లు, బడా వాణిజ్యవేత్తలు దాచివుంచిన నల్లధనం 30 లక్షలకోట్ల రూ॥ వుంటుందని ప్రభుత్వాల అంచనాలే తెలియ జేస్తున్నాయి.

విదేశీ బ్యాంకులలో నిల్వవుంచిన నల్లధనాన్ని వెలికితీయటానికి, బ్యాంకుల గోప్యత, ఆయా దేశాలలో అమలులోవున్న చట్టాలు ఆటంకంగా వున్నాయని చెప్తున్న ప్రభుత్వం, దేశంలో తమ చట్టాలు, తమ నిఘా, పాలనా యంత్రాంగాల సహాయంతో అక్రమంగా మేటలు వేస్తున్న లక్షలకోట్ల నల్లధనాన్ని ఎందుకు బయటపెట్టలేక పోతున్నది? జవాబు స్పష్టమే. బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే, సామ్రాజ్యవాద ప్రభువుల అడుగులకు మడుగులొత్తే దళారీ పాలకులు - బడా పెట్టుబడిదారుల, బడా వాణిజ్యవేత్తల నల్లధనం జోలికి పోవటానికే సాహసించరు. కనుక, తాము అధికారంలో వున్నంతకాలం కంటి తుడుపు చర్యలతో ప్రజలను మభ్యపుచ్చటం, ప్రతిపక్షంలో వున్నపుడు అధికారంలోనున్న పాలకపార్టీ నల్లధనాన్ని వెలికి తీయటంలో విఫలమైందని గొంతెత్తటం వారికి పరిపాటైంది.

విదేశాలలో నిల్వయున్న రూ॥ 70 లక్షల కోట్ల, స్వదేశంలో అక్రమ నిల్వలైన రూ॥ 30 లక్షలకోట్ల నల్లధనాన్ని వెలికితీస్తానని బీరాలు పలికిన బిజెపి, ప్రజల్ని వంచించటానికి మరోసారి పూనుకుంది. విదేశాల్లోవున్న నల్లధనాన్ని తేల్చి చెప్పాలంటూ గత ఏడాది ప్రకటించిన పథకంలో కేవలం మూడువేల కోట్ల రూపాయలను మాత్రమే రాబట్టగలిగింది.

ఇక, దేశంలో ఆదాయపు పన్నుశాఖకు లెక్కల్లో చూపని ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టిన నల్లధనాన్ని వెలికితీయటానికి బిజెపి ప్రభుత్వం సుతిమెత్తనైన మార్గాన్ని ఎంచుకుంది. నిర్దిష్టకాల వ్యవధిలో నల్లధన నిల్వలను స్వచ్ఛందంగా బయట పెట్టిన వారికి జరిమానాతో సరిపెడతామని, వారి పేర్లు వెల్లడి కానీయబోమని పలు హామీలతో వారిని దేబిరించింది. పన్నులు ఎగవేసిన వారిని, ఆదాయాలను తగ్గించి చూపినవారిని 'ఆదాయ వెల్లడి పథకం-2016' ద్వారా ముందుకు రావలసిందిగా బతిమలాడుకుంది.

మొత్తానికి, ఈ పథకం గడువు ముగిసిన-2016 సెప్టెంబర్ 30 నాటికి-64 వేలమంది ఆస్తిపరులు లెక్కకురాని 65,250 కోట్ల రూ॥నల్లధనాన్ని బయట పెట్టారు. అంటే సగటున ఒక్కో వ్యక్తీ ఒక కోటి రూ॥నల్లధనాన్ని మాత్రమే వెల్లడిచేశాడన్నమాట! ఈ ఆదాయంపై ప్రభుత్వం విధించిన పన్ను, మరియు జరిమానాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు షుమారు 30వేల కోట్ల రూ॥జమ అవనున్నాయని ఆర్థికమంత్రిత్వ శాఖ ప్రకటించింది. (మిగతా 35 వేల కోట్లకుపైగా డబ్బు సంబంధిత వ్యక్తులకే చెంది, బహిరంగ

చలామణిలోకి వస్తుంది) ఈ నిధులను దేశంలోని మౌలిక, గ్రామీణ రంగాలకు వెచ్చించనున్నామని ప్రకటిస్తూ తమ వల్లనే ఇంతటి ఘనకార్యం సాధించ బడిందని బిజెపి పాలకులు పోజుపెడతున్నారు.

పంటలు సరిగా పండక, అప్పుచెల్లించలేని నిస్సహాయ స్థితిలోనున్న బక్కరైతులపై ప్రతాపం చూపించగలిగిన ప్రభుత్వ, పాలనాధికార యంత్రాంగం, ఆతనికున్న చెంబూ తపేలాలను బయటవేసి, సెంటు, కుంట భూమిని సైతం జప్తుచేయగలిగిన బ్యాంకులు, పాలకులు–ఆస్తిపర, ధనిక వర్గాల జోలికి వెళ్ళాలనేసరికి కాలుచేయీ ఆడకపోవటం వారి వర్గ స్వభావాన్ని తెలియజేస్తోంది. అవినీతి, కుంభకోణాల్లో కోట్లకు పడగలెత్తన అక్రమార్జనాపరులు, భారీ బ్యాంకు రుణాలను చెల్లించక పారుబాకీల క్రింద చెల్లవేయించు కుంటున్న బడాపరిశ్రమాధిపతులు, వేలకోట్ల రూ॥ల పన్నులను ఎగవేసి, పైగా అంతర్జాతీయ న్యాయస్థానాల్లో పరువునష్టం వ్యాజ్యాలు నడుపుతోన్న బహుళజాతి కంపెనీల, వారి తైనాతీల ఆస్తుల పరిరక్షణకే కంకణం కట్టుకొన్న దళారీ పాలకులు ఇంతకుమించిన చర్యలు చేపడ్తారనుకోవటం అత్యాశే అవుతుంది.

గతంలో యుపిఏ ప్రభుత్వ కాలంలో, చిదంబరం ఆర్థికమంత్రిగా నల్లధనం వెల్లడికోసం ప్రకటించిన ఆదాయ వెల్లడి పథకంద్వారా, ఆనాటి ప్రభుత్వం కేవలం 10,100 కోట్ల రూ॥ నల్లధనాన్ని మాత్రమే వెల్లడి చేయించగలిగిందని దానికంటే తామెంతో మెరుగు కనుక తమను ఇంక ఎవరూ ప్రశ్నించరాదని బిజెపి పాలకులు భావిస్తూ జబ్బలు చరుచుకుంటున్నారు.

ఆదాయ పన్నుశాఖ వివరాల ప్రకారం 125 కోట్ల జనాభా వున్న మనదేశంలో సంవత్సరానికి 50 లక్షల రూ॥పైబడిన ఆదాయం కలవారు కేవలం లక్షన్నర మంది మాత్రమేనని చెప్పటాన్ని గమనిస్తే మనకళ్ళ ఎదుటే ఎందరు బడాచోర్‌లు బహిరంగంగా 'దాగి' వున్నారో అర్థమౌతుంది. చట్టాలను తమ చుట్టాలుగా మలచుకొని ఎందరు ధనస్వాములు ప్రభుత్వ ఆదాయాలకు గండికొడుతున్నారో స్పష్టమౌతోంది.

స్వదేశంలోకానీ, విదేశాలలోకానీ నల్లధనంగా చెలామణి అవుతున్న సంపదంతా ఆకాశం నుండి ఊడిపడిందీకాదు; అదృష్టం కలిసివచ్చి ఏ కొందరికో ఒనగూడిందీ కాదు. ఈ సంపదంతా అశేష కార్మిక, పీడిత ప్రజల శ్రమశక్తి ఫలితం; వారి కష్టార్జితమనేది తిరుగులేని వాస్తవం. కనుక శ్రామిక ప్రజానీకాన్ని ఘోర దురవస్థల పాల్జేసి, క్రూర దోపిడీకి గురిచేసి పోగేసుకున్న ఈ సమస్త సంపదంతా, వాటి సృష్టికర్తలైన, వాటి హక్కుదార్లైన పీడిత, శ్రామిక ప్రజానీకానికే చెందితీరాలి. అయితే, దోపిడీ వర్గ ప్రయోజనాలను పరిరక్షించే, వారి ప్రతినిధులైన ఈ దళారీ పాలకులను కూలదొయ్యకుండా ఈ సంపద మొత్తాన్ని వెలికితీసి, దేశ – ప్రజల సర్వతోముఖాభివృద్ధికి వినియోగించటం సాధ్యంకాదు.

ooooo